
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు

5★★

గురువారం 1 ఫిబ్రవరి 2024

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి 8లో..

అంజన్న భూములపై డిజిటల్ సర్వే 7లో..

జోరుగా యాసంగి సాగు

- ఇప్పటికే 90 శాతం మేర పంటలు
- లక్ష్యానికి చేరువలో పంటల సాగు
- వరి, మొక్కజొన్న, జొన్న, నువ్వు వైపు రైతుల మొగ్గు
- సాధారణ విస్తీర్ణాన్ని మించి వరి సాగు
- జిల్లా వ్యాప్తంగా 3.01 లక్షల ఎకరాల్లో పంటలు

జగిత్యాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా యాసంగి సాగు జోరుగా జరుగుతోంది. రైతులు పెద్దఎత్తున సాగు చేస్తున్నారు. రైతులు సాధారణ విస్తీర్ణంలో 90 శాతం మేర పంటలు వేశారు. మరో వారం రోజుల్లో వంద శాతానికి మించి పంటల సాగయ్యే అవకాశాలున్నాయని వ్యవసాయ అధికారులు అంటున్నారు. గత సీజన్ల మాదిరిగానే ఈ సీజన్ సైతం కొంత ఆలస్యంగా ప్రారంభమైంది. వానాకాలం సీజన్ ముగింపులో కురిసిన వర్షాలు కూడా ఆలస్యానికి కారణమయ్యాయి. యాసంగి మెల్లమెల్లగా పుంజుకొని ఆశించిన స్థాయిలో పంటల సాగును నమోదు చేసుకుంది. కాగా యాసంగిలో ప్రధానంగా నీటి వనరులకు అవకాశం ఉన్న భూముల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు.

● జిల్లాలో పంటల సాగు ఇలా...

జిల్లాలో యాసంగి సీజన్లో ఇప్పటివరకు రైతులు సుమారు 3,01,249 ఎకరాలల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. జిల్లా సాధారణ సాగు 3,40,000 ఎకరాలు కాగా ఇప్పటివరకు సుమారు 90 శాతం మేర పంటలు సాగు అవుతున్నాయి. ఇందులో ప్రధానంగా వరి, మొక్కజొన్న, జొన్న, నువ్వు పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో వరి 2,69,817 ఎకరాల్లో సాగు చేస్తుండగా మొక్కజొన్న 27,014 ఎకరాలు, జొన్న 1,056 ఎకరాలు, అనుములు 20 ఎకరాలు, శనగలు 135 ఎకరాలు, పెసర 90 ఎకరాలు, పల్లి 554 ఎకరాలు, ఆవాలు 236 నువ్వులు 1,706 ఎకరాలు, చెరుకు 338 ఎకరాలు, ఇతర వివిధ పంటలు 283 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

● ఆరుతడి పంటలు అంతంత మాత్రమే...

నీటి వనరులు అందుబాటులో లేని రైతులు, ఇళ్లకు దగ్గరగా ఉండే పొలాల్లో అక్కడక్కడా మొక్కజొన్న, ఇతర పంటలను సాగు చేస్తున్నారు. నీటి వనరులు లేని ప్రాంతాల్లో అధికారులు ఆరుతడి పంటలను వేయాలని పదేపదే సూచిస్తున్నా రైతులు మాత్రం వరివైపే మొగ్గు చూపుతున్నారు. ఆరుతడి పంటలకు ప్రధానంగా కోతులు, అడవి పందుల బెడద, పంట చేతికి వచ్చే సమయంలో అమ్మేందుకు సరియైన సౌకర్యాలు లేకపోవడంతో పలువురు రైతులు ముందుకు రావడం లేదు. వ్యవసాయ క్షేత్రాల్లో కోతుల బెడద, వన్యప్రాణుల సమస్యల కారణంగా కూర గాయాలు పండించడానికి, ఇతర ఆరుతడి పంటలు వేయడానికి రైతులు వెనకడుగు వేస్తున్నారు.

● కాలువలు, చెరువులు, బోర్లపైనే...

జిల్లాలో ప్రధానంగా రైతులు సాగునీటి కాలువలు, చెరువులు, కుంటలు, బోర్లపైనే ఆదారపడి వ్యవసాయం చేస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా జిల్లాలోని పలు మండలాలకు సాగు నీరు సరాఫరా అవుతోంది. దీనికి తోడు వరద కాలువకు సైతం నీటిని వదులుతుండడంతో తూములు, మోటార్లు ఏర్పాటు చేసుకొని రైతులు సాగునీరు వినియోగించుకుంటున్నారు. పలు ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, ఇతర చిన్న నీటి వనరుల్లో సైతం ఆశించిన స్థాయిలో నీరు ఉంది. దీంతో భూగర్భ జలాలు సైతం అందుబాటులో ఉంటున్నాయి. ప్రభుత్వం వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరాపరా ఇస్తుండడంతో రైతులు బోరు మోటార్లను వినియోగించుకుంటున్నారు. కాగా కాలువల చివరి ఆయకట్టు ప్రాంతాలకు నీరు అంతంతమాత్రంగా అందుతోంది. దీనికి తోడు కొన్నిచోట్ల భూగర్భ జలాలు దెబ్బతిని యాసంగి పంటలకు ఇబ్బంది కలుగుతోంది. ఇదే పరిస్థితి ముందు ముందు ఉంటే మరింత నష్టం తప్పదంటున్నారు.

● యూరియాకు డిమాండ్...

జిల్లా వ్యాప్తంగా ఈ యేడాది యాసంగి సీజన్లో రైతులు వరి పంట సాగుకు మొగ్గు చూపుతుండడంతో యూరియాకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీంతో రైతులు యూరియాను తీసుకెళ్లడానికి ఆయా ప్రాంతాల్లో ప్రాథమిక సహకార కేంద్రాలు, డీసీఎంఎస్లు, ప్రైవేటు డీలర్ల వద్దకు వస్తున్నారు. డిమాండ్కు తగ్గట్టుగానే అధికారులు యూరియాను అందుబాటులో ఉంచి రైతులకు అందించడానికి ప్రయత్నిస్తున్నారు. ఎక్కడ డిమాండ్ ఉందో గమనిస్తూ అక్కడికి యూరియాను సరఫరా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అదనంగా యూరియాను అందుబాటులో ఉంచడానికి ప్రయత్నిస్తున్నట్లు వ్యవసాయ అధికారులు అంటున్నారు.

● సాగు వివరాల నమోదు...


జిల్లాలో కొన్ని రోజులుగా వ్యవసాయాధికారులు రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను నమోదు చేస్తున్నారు. జిల్లాలోని 71 క్లస్టర్లలో ఏఈవోలు ఈ వివరాలను ఆన్లైన్లో నమోదు చేస్తున్నారు. రైతులు వేసిన పంటల విస్తీర్ణం బట్టి వ్యవసాయ ఉత్పత్తులు ఎంత మేర వస్తాయో అంచనా వేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ వివరాల ఆధారంగానే కొనుగోళ్లు చేసే అవకాశం ఉండడంతో ముందస్తుగా పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. భవిష్యత్తులో పంటల కొనుగోళ్లతో పాటు వ్యాపారులతో మాట్లాడేందుకు ఈ లెక్కలు ఉపయోగపడనున్నాయి.

● అంచనాకు తగ్గట్టుగా యాసంగి పంటలు

డాక్టర్ సురేశ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి



జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్లో అంచనాకు తగ్గట్టుగానే పంటలు సాగు అవుతున్నాయి. సాధారణ సాగులో ఇప్పటికే 90 శాతం మేరకు వివిధ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా వరి, మొక్కజొన్న పంట లున్నాయి. రైతుల అవసరాలకు తగ్గట్టుగా యూరియా, ఇతర వాటిని అందుబాటులో ఉంచుతున్నాము.



ఇచ్చిన ప్రతీ హామీకి కట్టుబడి ఉంటాం

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్కుమార్



గ్రామ పంచాయతీ భవనన్ని ప్రారంభిస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

బుగ్గారం, జనవరి 31: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీకి కట్టుబడి ఉంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని సిరికొండలో నిర్మించిన గ్రామపంచాయితీ భవనన్ని బుధవారం స్థానిక నాయకులతో కలిసి విప్ అడ్లూరి లక్ష్మణ్కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీ పథకాల్లో భాగంగా మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి పెంపు వంటి హామీలను అమలు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ఉంటామని, ప్రజలకు మేలు జరిగే విషయంలో పార్టీలకు అతీతంగా పనిచేస్తామని అన్నారు. కార్యక్రమంలో బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల సుభాష్, ఉపాధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్, సిరికొండ సర్పంచ్ చెన్నమల్ల దివ్యప్రవీణ్, కాంగ్రెస్ నాయకులు సిగిరి అంజిత్ కుమార్, కండ్లే మధన్, పుట్టపాక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాల టౌన్, జనవరి 31: మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్షలు తప్పవని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ హెచ్చరించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణకే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేపడుతున్నట్లు వివరించారు. గడిచిన 30 రోజుల్లో జిల్లావ్యాప్తంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 1,044 మందిని పట్టుకుని 334 మందికి కోర్టు ద్వారా రూ. 3.19 లక్షల జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు ఉన్నారు. అలాగే చాలాన్లు పెండింగ్లో ఉన్న వారు ప్రభుత్వ ఆదేశాల మేరకు రాయితీతో ఫిబ్రవరి 15లోగా చెల్లించాలని కోరారు.

జిల్లాలో పోలీస్ యాక్ట్

జగిత్యాల టౌన్, జనవరి 31 :జగిత్యాల జిల్లాలో ఫిబ్రవరి నెల చివరి వరకు పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ సన్ప్రీత్సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదన్నారు. వివిధ కార్యక్రమాల నిర్వాహణకు ముందుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

16న మున్సిపల్ ప్రత్యేక సమావేశం

రాయికల్, జనవరి 31: రాయికల్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లపై పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఈ నెల 16న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ బుధవారం నోటీసులు జారీ చేసినట్లు కమిషనర్ గంగుల సంతోష్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటీసులను కౌన్సిలర్లకు అందజేశామని పేర్కొన్నారు.

జగన్నాథ్పూర్లో అధికారుల సర్వే

రాయికల్, జనవరి 31: జగన్నాథ్పూర్-బోర్నపెల్లి వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మెల్సీ టి జీవన్రెడ్డి అధికారులను ఆదేశించగా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు డీఈ పీఆర్ మిలింద్, వర్క్ ఇన్స్పెక్టర్ అజయ్ జగన్నాథ్పూర్లో పర్యటించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి నిర్మాణం కోసం కొలతలు వేశారు. బ్రిడ్జి నిర్మాణానికి అయ్యే ఖర్చును అంచనా వేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పరాచ శంకర్, సర్పంచ్ విజయ భీర్వా, మాజీ సర్పంచులు సీడెం భీం, ఆత్రం భగవంత్, పటేల్ సుధాకర్, పెండూరు మారుతి, కృపాకర్, జగదీశ్వర్, వెంకటేష్, బోర్నపెల్లి కాంగ్రెస్ నాయకులు, ఉప సర్పంచ్ కొడిపెల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీపై అవిశ్వాసం వాయిదా

మల్యాల, జనవరి 31: మల్యాల ఎంపీపీ మిట్టపల్లి విమలపై అవిశ్వాసం ప్రకటిస్తూ ఎంపీటీసీలు ఇచ్చిన నోటీస్ నేపథ్యంలో జనవరి 9న హైకోర్టు స్టే జారీ చేయగా దాన్ని మరో రెండు వారాల పాటు పొడగించినట్లు ఎంపీపీ విమల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 20న పది మంది ఎంపీటీసీలు ఎంపీపీపై అవిశ్వాస నోటీస్ను ఆర్డీవోకు అందజేశారు. దీంతో జగిత్యాల ఆర్డీవో జనవరి 10న సమావేశం ఏర్పాటు చేశారు. దీనిపై ఎంపీపీ కోర్టును ఆశ్రయించడంతో విచారణ పూర్తి అయ్యే వరకు స్టే జారీ చేయగా ఆ సమావేశంలో ఎంపీటీసీలకు స్టే ఉత్వర్వులు వివరించి సమావేశం వాయిదా వేశారు. అయితే ఎంపీపీలపై అవిశ్వాసానికి సంబందించి కోర్టులో బుధవారం విచారణ ఉండగా ఫిబ్రవరి 12కు వాయిదా పడినట్లు ఎంపీపీ పేర్కొన్నారు. దీంతో తన స్టే కొనసాగుతున్నట్లు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, జనవరి 31: మల్యాల విద్యుత్ ఉపకేంద్రంలో గురువారం మరమ్మత్తులు చేపడతున్నట్లు ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉపకేంద్రం పరిధిలోని మల్యాల, ముత్యంపేట, రాజారం, నూకపల్లి గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీఎం రేవంత్రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

మల్లాపూర్, జనవరి 31 : మండలంలోని ముత్యంపేట గ్రామంలో సీఎం రేవంత్రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని రేవంత్రెడ్డి హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే రైతులుకు ఇచ్చిన హామీల్లో భాగంగా షుగర్ ఫ్యాక్టరీ పునః ప్రారంభించడానికి సిపార్సు కమిటీని ఏర్పాటు చేయడం హర్షంచదగ్గ విషయమన్నారు. దీంతో సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశామని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ జీవన్రెడ్డి

రాయికల్, జనవరి 31: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు ఎమ్మెల్సీ టి జీవన్రెడ్డి అన్నారు. రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. గ్రామంలోని పద్మనాయక సంఘంలో నూతన బోరును ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని తెనుగువాడ, అత్తినేని వాడ, ఎంబారి వాడ, డి-53 కెనాల్ వద్ద, పలు వార్డులలో రూ.40 లక్షలతో నిర్మించనున్న రోడ్లు, డ్రైనేజీ పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజరెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్ రావు, మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, కొయ్యడి మహిపాల్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎంబారి రమేష్, వార్డు సభ్యులు ఉరుమడ్ల వాసు, ఎంబారి సురేష్, ఎండీ ముజాజ్, కొప్పుల దేవి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: మండలంలోని గుల్లపేట గ్రామంలోని ప్రైమరీ స్కూల్ లో ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంక్ను ఎమ్మెల్సీ టి జీవన్రెడ్డి బుధవారం ప్రారంభించారు. పాఠశాలలో విద్యార్థుల తాగునీటి సౌకర్యార్థం కోసం గ్రామానికి చెందిన మధుసూదన్రెడ్డి పాఠశాలకు వాటర్ ట్యాంక్ను వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గుల్లపేట గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచితే ఉపాధ్యాయుల సంఖ్యను పెంచుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కుల తిరుపతి, ఎంపీటీసీ సురేందర్రెడ్డి, మాజీసర్పంచ్ శేఖర్, గ్రామస్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాల్వ ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ అంజయ్య

కోరుట్ల రూరల్, జనవరి 31: మండలంలోని కల్లూర్ గ్రామ శివారులోని మాటు కాల్వపై ఉన్న మత్తడిని గుర్తు తెలియని వ్యక్తులు గండి కొడుతూ నీటిని వృధా చేస్తున్నారని ఆరోపిస్తూ గ్రామ సర్పంచ్ వనతడుపుల అంజయ్య పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు.

ఈ సందర్భంగా వనతడుపుల అంజయ్య మాట్లాడుతూ గ్రామ శివారులోని రాత్రి వేలలో గుర్తు తెలియని వ్యక్తులు మాటు కాల్వపై ఉన్న మత్తడిని తొలగిస్తూ నీరు వృధా చేస్తున్నారని వారిని గుర్తించడానికి నిఘా ఏర్పాటు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇలా కొనసాగితే రైతులు సాగు నీరు అందంక ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు. గ్రామస్థులు ఆధ్వర్యంలో కూడా నిఘా ఉంచుతామని తెలిపారు. అదే విధంగా నీటి పారుదల శాఖ అధికారుల దృష్టికి తీసుపోతామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

అయోధ్య సైకిల్ యాత్రికులకు సన్మానం

రాయికల్, జనవరి 31: పట్టణంలోని గుండేటి మాధవ్, నల్లూరి వరుణ్ అయోధ్య బాలరాముని దర్శనానికి సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా రాయికల్కు చేరుకున్న యువకులను మండలంలోని అయోధ్య గ్రామంలోని రామ మందిరంలో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఆణిముత్య కల్చరల్ డ్యాన్స్ అకాడమీ డ్యాన్స్ మాస్టర్ కొమురవెల్లి చిరంజీవి, సర్పంచ్ ఎడమల జీవన్ రెడ్డి, ఎంపీటీసీ రాణవేణి రవీందర్, ఉపసర్పంచ్ రవీందర్, కొమురవెల్లి వేణు, పసుపునూరి శ్రీను, మల్లేష్, బండారి సురేష్, కాటిపెల్లి మహేష్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల, జనవరి 31: మండల కేంద్రంలో నిర్మించిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మండల కేంద్రానికి చెందిన నేరెల్ల మల్లేశంగౌడ్లక్ష్మి దంపతులు 25,021 రూపాయల నగదును విరాళంగా ఆలయ పూజారి నాగరాజు రమేష్కు అందించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన



పోటీల్లో గెలుపొందిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

రాయికల్, జనవరి 31: రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం కుష్టు వ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు కుష్టు వ్యాధి గురించి ఉపన్యాస పోటీలు నిర్వహించి గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ డీపీఎంవోలు దేవీసింగ్, హీర్య నాయక్, రాయికల్ మండల పర్యవేక్షణాధికారులు కె ప్రమీళ, టి శ్రీధర్, బి రత్నమాణిక్యం, ఏఎన్ఎం ఫాతిమా, ఆశా కార్యకర్త వసంత, హెచ్ఎం రాఘవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదవులు శాశ్వతం కాదు..ప్రజాసేవే ముఖ్యం

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కొండాపూర్లో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, జనవరి 31: పదవులు శాశ్వతం కాదని ప్రజాసేవే ముఖ్యమని చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం మండలంలోని కొండాపూర్ గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవీ లేకున్న ప్రజాసేవ చేయటం అదృష్టంగా బావించాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. సమస్యల పరిష్కారానికి, గ్రామాభివృద్ధికి తాను శక్తి వంచనలేకుండా కృషి చేస్తానన్నారు. నా విజయానికి పాటుపడిన మీ అందరికి కృతజ్ఞతలు తెలుపుతు న్నానన్నారు. కార్యక్రమంలో సర్పంచు సామంతుల ప్రభాకర్, ఎంపీపీ స్వర్ణలత, జడ్పీటీసీ ప్రశాంతి, ఎంపీడీవో పద్మజరాణి, తహసీల్దార్ రవికాంత్, ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఎంపీటీసీ రాజేశ్వరీరాజేందర్, ఉపసర్పంచు రమేష్, పంచాయతీ సభ్యులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జీవన్రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున్రెడ్డి, ముత్యం శంకర్, ప్రభాకర్రెడ్డి, మల్లేశంయాదవ్, దిలీప్, నర్సయ్య, కొండాపూర్, బొల్లోనిచెరువు గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.

● గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి..

మల్యాల: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితో పాటు మౌలిక వసతుల కల్పనకు ప్రాధన్యమివ్వనున్నట్లు తెలిపారు. లంబాడిపల్లిలో తరగతి గదుల నిర్మాణ పనులు, సర్వాపూర్లో నూతన గ్రామపంచాయతీ భవనం, ముత్యంపేటలో పల్లె దవాఖాన భవనం ప్రారంభించారు. మల్యాల బ్లాక్ చౌరస్తా వద్ద అచార్య కొండ లక్ష్మణ్బాపూజీ, నూకపల్లిలో అంబేద్కర్ విగ్రహాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ విమల, ఎంపీడీవో వెంకటేషం, తహసీల్దార్ మునీందర్, ఎంఈవో శ్రీనివాస్, వైద్యాధికారి మౌనిక, సర్పంచ్లు తిరుపతి, గంగవ్వ, తిరుపతిరెడ్డి, సుదర్శన్, సరోజ, ఎంపీటీసీ రేణుక, విండో చైర్మన్ రాంలింగారెడ్డి, నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్గౌడ్, నరసింహరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ముత్యం శంకర్, సతీష్రెడ్డి, వంశీధర్, ప్రకాష్రెడ్డి, పద్మశాలి సంఘం నాయకులు ముల్క మల్లయ్య, బోడ గోవర్దన్, ఒడ్డెపల్లి శశాంక్, తాటిపాముల జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ జరుపుతున్న డీఎస్పీ రవీందర్రెడ్డి

కథలాపూర్, జనవరి 31: మండలంలోని బొమ్మెనలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ వంగ రవీందర్రెడ్డి బుధవారం విచారణ జరిపారు. గ్రామానికి చెందిన పొడేటి పాల్ అనే వ్యక్తికి చెందిన భూమిలోకి అక్రమంగా ప్రవేశించి కులం పేరుతో దూషించిన తుమ్మనపల్లి రాజేంద్రప్రసాద్పై కేసు నమోదు కాగా డీఎస్పీ వంగ రవీందర్రెడ్డి విచారణ చేపట్టారు. పలువురిని విచారించి అభిప్రాయాలు నమోదు చేసుకున్నారు. ఆయన వెంట ఎస్సై పబ్బ కిరణ్కుమార్, సిబ్బంది ఉన్నారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన

కోరుట్ల, జనవరి 31: పట్టణంలోని లిటిల్ జీనియస్ పాఠశాలలో మమత మల్టీ స్పెషాలిటి ఆసుపత్రి వైద్యురాలు మధుశ్రీసంతోష్ సర్వికల్ క్యాన్సర్ నివారణపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. వ్యాధి సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బండి మహాదేవ్, ప్రిన్సిపల్స్ రాధాకృష్ణ, వినోద్, రాజు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వేములవాడ టౌన్, జనవరి 31: మద్యం మత్తులో గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి చెందిన సంఘటన వేములవాడ మండలం అనుపురం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మేర్గు శ్రీనివాస్ (26) అనే వ్యక్తి మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. దీంతో గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు మృతుడి భార్య శ్రీలత పోలీసులకు ఫిర్యాదు చేసింది.



జి సాయిప్రియ

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు డిగ్రీ విద్యార్థిని

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 31: హైదరాబాద్‌లోని బాచుపల్లిలో ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు జరిగే 49వ జాతీయ స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల క్రీడాకారిణి జి సాయిప్రియ ఎంపికైంది. గత నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో అత్యంత ప్రతిభ చాటి కరీంనగర్ జట్టుకు 3వ స్థానాన్ని అందించడంలో కీలకపాత్ర పోషించిన ఆమె జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి శ్రీధర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ టి. శ్రీలక్ష్మి, అధ్యాపక బృందం అభినందించారు.

జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక

తిమ్మాపూర్, జనవరి31: మండలంలోని మొగిళిపాలెం జిల్లా ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అపూర్వ ఫిబ్రవరి 2 నుంచి 6వరకు ఛత్తీషఘడ్ రాష్ట్రం, ఖాటీర్ దాంలో జరగనున్న జాతీయ స్థాయి పాఠశాలల క్రీడల ఆధ్వర్యంలో జరగనున్న సాఫ్టబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ ఆడెపు శ్రీనివాస్ తెలిపారు. జనవరి 16 నుంచి 18 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన 67వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సాఫ్టబాల్ 14 సంవత్సరాల విభాగం పోటీల్లో కరీంనగర్ జిల్లాకు అపూర్వ, సాయి శరణ్యలు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో మూడవ స్థానంలో గెలుపొందగా అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అపూర్వను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అపూర్వను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, పిఈటి అడేపు శ్రీనివాస్ , ఉపాధ్యాయులు ఈశ్వర్, వివేక్, విద్యా సాగర్, దేవేందర్, లక్ష్మి, తిరుమల, గ్రామ సర్పంచ్ సుస్మితరెడ్డి, ఎంపిటిసి తిలక్ ప్రియారెడ్డి అభినందించారు.

సైబర్ మోసంతో డబ్బులు మాయం

వీణవంక జనవరి31: మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన పురంశెట్టి వెంకటేష్ మొబైల్ ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వచ్చింది. బిట్‌కాయిన్‌తో ఎంత డబ్బులు పెడితే అంతకు రెట్టింపు డబ్బులు వస్తాయని తప్పుడు సంకేతాలు ఇచ్చి 6,42,040 రూపాయలు కాజేశారని అనంతరం ఎలాంటి స్పందన లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ప్రజలు మొబైల్ ఫోన్‌కు వచ్చే అనవసరపు లింకులు ఓపెన్ చేయవద్దని సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడి ఆర్థికంగా మోసపోవద్దని తెలిపారు.

రాజన్న ఆలయాభివృద్ధిపై సీఎం సమీక్ష

● రూ.20 కోట్ల నిధుల విడుదలకు ఆదేశం ● రోడ్డు విస్తరణ, బ్రిడ్జి నిర్మాణానికి త్వరలో రూ.35 కోట్ల నిధులు

సిరిసిల్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి గతంలో హెచ్ఎండీఏ సాఫ్ట్ లోన్ ద్వారా మంజూరై నిలిచిన రూ.20 కోట్ల నిధులను విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న పనులపై పవర్ ప్రజంటేషన్ ద్వారా వీటీడీఏ వైస్ ఛైర్మన్ అనురాగ్ జయంతి ముఖ్యమంత్రికి వివరించారు. దేవస్థానం అభివృద్ధి, బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి నమూనాలను, పార్కింగ్ స్థలంలో టూరిజం శాఖ చేపడుతున్న పనులను వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ నిలిచిపోయిన నిధులు రూ 20 కోట్లను విడుదల చేయాలని ఆదేశిస్తూ బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి, శివార్చన మండప నిర్మాణం, గుడిచెరువు సుందరీకరణ, నటరాజ విగ్రహం ఏర్పాటుతోపాటు పార్కు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధితోపాటు టూరిజం శాఖ పనుల్లో వేగం పెరగాలన్నారు. వేములవాడ పట్టణ ప్రజలతో పాటు రాజన్న భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తీర్చేలా మూలవాగు బ్రిడ్జితో పాటు బ్రిడ్జి నుంచి 800 మీటర్ల వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు. రోడ్ల విస్తరణతోపాటు మూలవాగు బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన రూ.35 కోట్లు నిధులు త్వరలో విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. గుడిచెరువులోకి వివిధ కాలువల ద్వారా మురికి నీరు చేరకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నూతన కాలువల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మురుగు కాలువల నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధుల విడుదల చేయాలని, మురుగు నీటిని ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా శుద్ధి చేయాలని అన్నారు. గుడిచెరువు విస్తీర్ణం, పార్కింగ్ స్థలాల వివరాలను సీఎం తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, హెచ్ఎండీఏ కమిషనర్ దానకిషోర్, కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ గౌతమి, దేవాదాయ కమిషనర్ అనిల్‌కుమార్, వేములవాడ దేవస్థానం ఈవో కృష్ణప్రసాద్, వేములవాడ కమిషనర్ అవినాష్ పాల్గొన్నారు.


ముఖ్యమంత్రికి రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఆది శ్రీనివాస్

ముఖ్యమంత్రికి రాజన్న ప్రసాదం

హైదరాబాద్‌లో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ సమీక్ష సమావేశం సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాజరాజేశ్వరస్వామి ప్రసాదాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు. మురికి నీటి కాలువల నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధులు మంజూరు చేసి వీటీడీఏ సమావేశాన్ని నిర్వహించిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

డైట్‌లో పద్య రచన కార్యశాల

తిమ్మాపూర్, జనవరి31: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో బుధవారం పద్య రచన కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా ప్రముఖ కవి, అవధాని, సాహితీ రత్న డాక్టర్ గంద్ర లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పద్యం సాంస్కృతిక వారసత్వాన్ని, జాతి జీవనాన్ని భావితరాలకు అందిస్తుందన్నారు. పద్యం బ్రహ్మ పదార్థం కాదని, పద్యం రాయడం చాలా తేలిక అని తెలిపారు. పద్యం లయను, నాడిని, నడకను పట్టుకుంటే పద్య రచన చాలా తేలిక అని అన్నారు. పద్యంలో చందోనియమాలు ఉన్నప్పటికీ ఆ చందస్సు నియమమే పద్య రచనలను చాలా హృద్యంగంగా, రసనైకవేద్యంగా మలు స్తుందన్నారు. పద్య లక్షణాలను గణాలను, యతిప్రాసలను వివరిస్తూ ఏఏ సందర్భాల్లో ప్రాస నియమం పాటించబడుతుందో సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య మాట్లాడుతూ జిల్లా విద్యా శిక్షణ సంస్థ కేవలం పెడగాగికి సంబంధించిన అంశాలే కాకుండా ఛాత్రోపాధ్యాయుల పరిపూర్ణ మూర్తిమత్వ వికాసానికి దోహదపడే విధంగా వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగానే పద్య రచనపై కార్యశాల నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యశాలను ఉపయోగించుకొని భవిష్యత్తులో విద్యార్థులు మంచి పద్య కవులుగా ఎదగాలని ఆశిస్తున్నామన్నారు. విభిన్న అంశాలపై విద్యార్థులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయులు కె.శంకర్, చెరుకు ప్రద్యుమ్న కుమార్, మహేశ్వర్‌రెడ్డి, గాజుల రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బియ్యం షాపులపై తూనికలు కొలతల శాఖ దాడులు

● ఐదు కేసులు నమోదు

కరీంనగర్ క్రైం, జనవరి 31: నగరంలోని బియ్యం షాపులపై తూనికలు కొలతల శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించి ఐదు కేసులు నమోదు చేశారు. నగరంలోని గంజ్ ప్రాంతంలో వినియోగదారుల ఫిర్యాదు మేరకు శ్రీమాతారైస్‌డిపో, సాయిసరస్వతి కిరాణం, ఉప్పల క్రిష్ణమూర్తి కిరాణ షాపులపై దాడులు చేసి ఐదు కేసులు నమోదు చేసి, 230 రైస్ బ్యాగులు సీజ్‌చేశారు. ఈ దాడుల్లో లీగల్ మెట్రాలజి కరీంనగర్ జోన్ ఎసి కె విజయసారధి, కరీంనగర్ జిల్లా ఇన్స్‌పెక్టర్ భూలక్ష్మి, ఇన్స్‌పెక్టర్ డి రూపేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో జింకు లోపాన్ని గుర్తించాలి

గంగాధర, జనవరి 31: వరిలో జింకు లోపం నివారణకు పొలాలు ఎర్రబడకుండా ఉండేందుకు జింకు వేయాలని జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కాసారం, పోతుగంటిపల్లి, గోపాల్‌రావుపల్లి గ్రామాల్లో వరిపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి వేసుకున్న రైతులు తప్పకుండా మెలుకువలు పాటించాలని, ఎప్పటికప్పుడు పంట ఏ రకంగా పెరుగుతుందో పరిశీలించాలన్నారు. ఇటుక రంగుతో పైరు ఎర్రబారిన వెంటనే జింక్ వేసుకోవాలని జింక్ వేయకుండా నిర్లక్ష్యం చేస్తే పంటలు పాడవుతాయన్నారు. ప్రస్తుతం పొలాల్లో జింక్‌లోపం, కాండం తొలుచుపురుగు, సల్ఫైడ్ ప్రభావం కనిపిస్తుందన్నారు. నివారణకు తగిన మందులు వాడాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏవో రాజు, ఆయా గ్రామాల రైతులు, ఏఈవోలు పాల్గొన్నారు.

అంజన్న భూములపై డిజిటల్ సర్వే


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మల్యాల, జనవరి 31: దిగువ కొండగట్టులో గల ఆంజనేయస్వామి దేవస్థానం భూములను అధికారులు బుధవారం డిజిటల్ సర్వే చేశారు. సర్వే నంబర్ 380సిలో దేవస్థానానికి 1.30ఎకరాల భూమి ఉండగా అందులో ఇటీవల అక్రమ నిర్మాణం జరుగుతుందని పలువురు ఫిర్యాదు చేయడంతో సర్వే చేపట్టారు. పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఏఈ లక్ష్మణ్‌రావు, సుధాకర్‌రెడ్డి తదితరులు సర్వే సిబ్బందితో దేవస్థానం భూమిని, నిర్మాణాన్ని పరిశీలించారు.

ధర్మపురిలో బీసీ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ పూజలు

ధర్మపురి, జనవరి 31: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని బీసీ వెల్ఫేర్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్ దంపతులు బుధవారం సందర్శించారు. ఆలయం సంప్రదాయం ప్రకారం అర్చకులు, సిబ్బంది వారికి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు వారిని ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు. అలాగే వారు అనుబంధ ఆలయాలను, అద్దాల మండపాన్ని కూడా సందర్శించారు. అంతకు ముందు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. వారి వెంట బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి సాయిబాబా, బీసీ హాస్టల్ వార్డెన్స్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, హాస్టల్ వార్డెన్స్ సుధాకర్, నివేదిత, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న చంద్రశేఖర్ దంపతులు

త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు


వేములవాడలో నృత్య ప్రదర్శన

వేములవాడ, జనవరి 31 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలలో రెండో రోజు బుధవారం నిర్వహించిన పలు సంగీత నృత్య కార్యక్రమాలు కళాభిమానులను ఆకట్టుకున్నాయి. ఉదయం శిఖామణి భాగవతారిణి హరికథా గానం చేయగా మధ్యాహ్నం జయకృష్ణ భాగవతార్ హరికథ వినిపించారు. సాయంత్రం కె. నరహరి శర్మ, హెచ్. సతీష్, ఆర్. హరికృష్ణ సంగీత కచేరితో సంగీతాభిమానులను అలరించారు. అనంతరం డీవి మోహన కృష్ణ శాస్త్రీయ సంగీత కచేరి చేసి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం ఎన్. సతీందర్, ఆర్. విజయశ్రీ, శ్రీదేవి, వి. శరణ్య, అశ్విని బృందం నిర్వహించిన సంగీత కచేరి ఆకట్టుకుంది. రాత్రి శ్రీత్రైలోక్య ఆర్ట్ క్రియేషన్స్ బృందం వారు నిర్వహించిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను రంజింపజేసింది.

గట్టుసింగారంలో వెలుగులోకి రాతి చిత్రాలు


రాతి చిత్రాలతో ఉన్న గుహను చూపిస్తున్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం

పంజాగుట్ట,జనవరి31(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గట్టుసింగారం గ్రామంలోని సీతమ్మ లొద్దిలో పాము పడగలా ఉన్న అతి పెద్ద రాతి గుహ, అద్భుతమైన రాతి చిత్రాల సంపద వెలుగులోకి వచ్చింది. ఆరున్నర కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడ్డ నత్తగుల్ల శిలాజం, లక్ష సంవత్సరాల క్రితం నాటి రాతి గొడ్డలి, సూక్ష్మ రాతి పనిముట్లు, తొలి చారిత్రక యుగానికి చెందిన ఆరు శాసనాలు, చిత్రాలు వెలుగు చూశాయి. కొత్త తెలంగాణ చరిత్ర బృందం గౌరవ సలహాదారుడు, ఫొటో జర్నలిస్ట్ డి.రవీందర్ రెడ్డి దీనిని వెలుగులోకి తెచ్చారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. రామగిరి ఖిల్లా వెనకాల అడవిలో సీతమ్మలొద్దిలో గుహ ఉన్నట్లు స్థానికులు చెప్పడంతో బృం దంతో కలిసి వెళ్లినట్లు తెలిపారు. ఈ రాతి చిత్రాలలో మధ్యరాతి యుగం(12 వేల సంవత్సరాల నుంచి), తొలి చారిత్రక యుగం(క్రీస్తు శకం 1 నుంచి 6వ శతాబ్దం వరకు)వేసినవి, ఎక్కువగా ఎరుపు రంగులో, కొన్ని చోట్ల తెలుపు, పసుపు రంగులలో వేసిన పురాతన రాతి చిత్రాలు ఉన్నాయన్నారు. ఇలాంటి రాతి చిత్రాలు గతంలో ఎక్కడా లభించలేదని తెలిపారు. స్త్రీ, పురుషులు ప్రత్యేకమైన ఆహార్యంతో, పాదరక్షలు ధరించి ఒక పంక్తిలో, గుండ్రంగా చేతులు పట్టుకుని సామూహికంగా నృత్యాలు చేస్తున్న దృశ్యాలు ఉన్నాయని, జంతువుల చిత్రాలలో జింకలు, తాబేళ్లు, అడవి పిల్లి, కోతులు, అడవి బల్లుల బొమ్మలు, మనుషుల చిన్న, పెద్ద పాద ముద్రికలు ఉన్నాయన్నారు. బృందం ఆధ్వర్యంలో తెలంగాణ చరిత్రను అన్వేషిస్తున్నామని, దానిని భావితరాలకు అందిస్తామన్నారు. తెలంగాణలో ఎంతో చరిత్ర ఉందన్నారు. పరిశోధనలతో చరిత్రను వెలుగులోకి తెస్తామన్నారు. రాతి చిత్ర నిపుణుడు, న్యూమిస్మాటిస్ట్ డాక్టర్ బండి మురళీధర్ రెడ్డి, సంస్థ కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, కో కన్వీనర్ గిరీష్, చరిత్రకారుడు ఈమని శివనాగిరెడ్డి, ఆర్కియాలజిస్ట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

మహిళ హత్య కేసులో జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, జనవరి 31: సహజీవనం చేస్తున్న మహిళను కర్రతో కొట్టి ఆమె చావుకు కారకుడైన వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు 5వేల రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి లక్ష్మికుమారి బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రం బక్కర్ గ్రామానికి చెందిన మహిళ రామ్ కాళీ (26)కి పెళ్లయి ఇద్దరు సంతానం ఉన్నారు. అదే గ్రామానికి చెందిన టెక్కం శ్యామ్‌రాజ్ (29)తో ఆమె అక్రమ సంబంధం కారణంగా రామ్‌కాళీ భర్త ఆమెతో విడాకులు తీసుకున్నాడు. తన ఇద్దరు పిల్లల్ని తల్లి దగ్గర వదిలి రామ్ కాళీ బతుకుదెరువు కోసం శ్యామ్‌రాజ్‌తో కలిసి కరీంనగర్‌కు వచ్చి అల్గునూర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటూ కూలీపనికి వెళ్తున్నారు. 2022 నవంబర్ 1న మేస్త్రీ శ్యామ్‌రాజ్‌కు కూలి డబ్బులు ఇవ్వగా అవి నాకు ఇవ్వాలని వాటిని తల్లి పిల్లల పోషణకు పంపించాలని శ్యామ్‌రాజ్‌తో గొడవ పడింది. కొద్ది డబ్బులు తన దగ్గర ఉంచుకొని మిగతా డబ్బులను శ్యామ్ రాజ్ ఆమెకిచ్చినా వినకుండా మొత్తం డబ్బులు కావాలని ఆమె అడుగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీనితో శ్యామ్‌రాజ్ అక్కడే ఉన్న కర్రతో రామ్ కాళిని తలపై కొట్టగా తీవ్ర గాయాలతో ఆమె చనిపోయింది. ఈ సంఘటనపై ఎల్ఎండి ఎస్ఐ ప్రమోద్‌రెడ్డి శ్యాంరాజుపై హత్యానేరం నమోదు చేయగా సీఐ శశిధర్‌రెడ్డి దర్యాప్తు చేశారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలురు శ్రీరాములు కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్షాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి శ్యామ్‌రాజ్‌కు జీవిత ఖైదుతోపాటు 5వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

కోరుట్ల, జనవరి31: పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన ఇల్లెందుల గంగాధర్ (45) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకొని బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం కోనరావుపేట గ్రామానికి చెందిన గంగాధర్ పట్టణంలోని అర్బన్ కాలనీలో భార్యాపిల్లలతో నివాసం ఉంటూ కుల వృత్తి అవుసుల పని చేస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి గంగాధర్ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ తరచుగా బాధపడేవాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గంగాధర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

ఓయూలో విద్యార్థి ఆత్మహత్య


ఎర్ర నవీన్(ఫైల్)

తార్నాక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఓయూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రాంతానికి చెందిన ఎర్ర నవీన్ (23) ఓయూలో ఎం.కామ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల క్రెడిట్ కార్డుల ద్వారా అప్పులు చేసి బిట్ కాయిన్‌లో డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో గత కొద్ది రోజులుగా తీవ్ర మనస్తాపం చెందిన నవీన్ ఓయూలోని మంజీరా హాస్టల్‌లో మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. తోటి విద్యార్థులు నవీన్‌ను హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఓయూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ పంచాయతీ విషయమై రైతు ఆత్మహత్యాయత్నం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 31: ఐదేళ్లుగా భూపంచాయతీని పెద్దమనుషులు సాగదీస్తుండడంతో జీవితం మీద విరక్తి చెందిన మండలంలోని జాఫర్‌ఖాన్‌పేటకు చెందిన రైతు బొజ్జం శివకృష్ణ బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. అంతకు ముందు ఆత్మహత్య చేసుకుంటున్నానని సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేయగా వైరల్‌గా మారింది. గ్రామానికి చెందిన పెద్ద మనుషులు పంచాయతీని సాగదీస్తూ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ శివకృష్ణ పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడిని పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 31: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి చంద్రాపూర్ వైపు వెళ్తున్న బొలేరో వాహనం తుమ్మన్నపల్లి గ్రామ శివారులో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనం నడుపుతు న్న గురుదాస్‌సింగ్‌దార్(53) అక్కడికక్కడే మృతి చెందగా, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. మృతదేహాన్ని, క్షతగాత్రుడిని హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

తిమ్మాపూర్, జనవరి31: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బుధవారం ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలలో తొలివిడత జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ (జేఈఈ మెయిన్) పేపర్-1 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మండలం కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ రెండు పరీక్ష కేంద్రాలలో రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో రెండు పరీక్ష కేంద్రాలలో కలిపి 880మందికి 862 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 18మంది గైర్హాజరైయ్యారు. మధ్యాహ్నం 3నుంచి 6గంటల జరిగిన రెండవ సెషన్‌లో 817 మందికి 760మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 57మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు ఎన్‌టిఏ సీటీ కో ఆర్డినేటర్ లలిత కుమారి తెలిపారు.

భూపతిపూర్‌లో పౌర హక్కుల దినోత్సవం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయికల్, జనవరి 31: మండలంలోని భూపతిపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో పౌర హక్కుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలో అంటరానితనాన్ని రూపుమాపాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎండీ ఖయ్యూం, సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, ఉప సర్పంచ్ వేణు, వైస్‌ఎంపీపీ మహేశ్వర్‌రావు, అంబేద్కర్ సంఘం (మాదిగ) అధ్యక్షుడు పెద్దిరెడ్డి సాయబు, అంబేద్కర్ సంఘం (మాల) అధ్యక్షుడు మండల ప్రవీణ్, కుల సంఘాల పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని రంగదాముునిపల్లెలో బుధవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగం, పౌరుల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూరమల్ల సతీష్, ఎస్సై నరేష్, ఆర్ఐ జీవన్, సర్పంచ్, సెక్రెటరీ, వివిధ శాఖల అధికారులు, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు భోజనపు శ్రీనివాస్, మాలల ఐక్య వేదిక అధ్యక్షుడు పొనగంటి రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాలను పరిశీలించిన ఏవో

కొడిమ్యాల, జన వరి 31: మండలం లోని హిమ్మతురా వు పేటలోని వరి పొలాలను ఏవో పి జ్యోతి బుధవా రం పరిశీలించా రు. వరిలో మొగి పురుగు, జింక్‌లో పాన్ని గుర్తించి తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఏవో వెంట సర్పంచు కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్ రాజేందర్, ఏఈవో గ్రీష్మ, సింగిల్ విండో డైరెక్టర్ వేణుగోపాల్‌రావు, రైతులు ఉన్నారు.

మద్దులపల్లి పాఠశాలలో మాక్ పోలింగ్


మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పెగడపల్లి, జన వరి 31: మండ లంలోని మద్దుల పల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠ శాలలో బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఎన్ని కల ప్రక్రియ తెలి యజెప్పేందుకే మాక్ పోలింగ్ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు సత్యం తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కు వినియో గించుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసుల కళాజాతా

ఎండపల్లి, జనవరి 31: మండలంలోని పాతగూడూర్ గ్రామంలో సామాజిక అంశాలపై పోలీస్ కళాబృందం వారితో ప్రజలకు అవగాహన కార్యక్రమం వెల్గటూర్ ఎస్ఐ శ్వేత ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్వేత మాట్లాడుతూ.. మూఢనమ్మకాలు, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్‌ల మోసాలు, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వీటి వల్ల నేరాలు అరికట్టవచ్చని అన్నారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా నేరుగా స్టేషన్ వచ్చి తెలపాలని, లేదా 100కి ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు వారి వద్దకు వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాబృందం, గ్రామస్థులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ మృతి బాధాకరం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జనవరి 31: రోడ్డు ప్రమాదంలో కంప్యూటర్ ఆపరేటర్ మ్యాన సంతోష్ మృతి చెందడం బాధాకరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణానికి చెందిన సంతోష్ వెల్గటూర్ మండల ప్రజాపరిషత్ ఆఫీస్‌లో విధులు నిర్వర్తించేందుకు వెళుతుండగా ఆటోలో నుంచి కింద పడి మృతి చెందాడు. సంఘటన గురించి తెలుసుకున్న ఆయన బుధవారం నివాళులర్పించారు. అనంతరం మృతుడి తల్లి మున్సిపల్ కో ఆప్షన్ సభ్యురాలు మ్యాన పద్మ- శంకర్, కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కుటుంబసభ్యులకు ఆయన సానుభూతి తెలిపారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యులు సంగన భట్ల దినేష్, మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, రమేష్, గణేష్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వీఆర్ఏల వినతి

రాయికల్, జన వరి 31: తమ స మస్యలను పరిష్క రించాలని కోరుతూ రాయికల్ మండల వీఆర్ ఏలు తహసీల్దార్ ఎండీ ఖయ్యూంకు బుధవారం వినతి పత్రం సమర్పిం చారు. 61 సంవత్స రాలు పైబడిన వీఆర్ఏలు 3,797 మంది వారసుల నియామకపు ఉత్త ర్వు లు ఇప్పించాలని కోరారు. గత రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తూ జీవో నంబర్ 81, 85, 98 ప్రకారం 3,797 మందిని 61 సంవత్సరాలు నిండిన వీఆర్ఏల వారసులకు చదువులను బట్టి జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, అటెండర్ క్యాడర్ నిర్ణయించిన జీవోలు జారీ అయ్యాయన్నారు. ఆరు నెలలు గడుస్తున్నా నియామక ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాయికల్ మండల అధ్యక్షుడు ఎ నరేష్, ఆర్ తిరుపతి, పి నర్సయ్య, క్యాషియర్ నరేష్,వెంకటేష్ పాల్గొన్నారు.

కులసంఘాల భవనాలు ప్రారంభం


సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, జడ్పీచైర్‌పర్సన్

జగిత్యాల రూర ల్, జనవరి 31: మండలంలోని న ర్సింగాపూర్ గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 2.50 లక్షలతో నిర్మించిన విశ్వబ్రాహ్మణ సంఘభవనం, సీడీ పీ నిధులు రూ. 6.50 లక్షలతో నిర్మించిన గౌడ సంఘ భవనాలను ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌ను పట్టణానికే పరిమితం చేస్తామని అన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ గీతా కార్మికుల వృత్తి నిత్యం కత్తిమీద సాము లాంటిదన్నారు. జడ్పీచైర్‌పర్సన్ దావ వసంతసురేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో చెట్టు పన్ను రద్దు చేసి గౌడ కులస్థులకు కేసీఆర్ అండగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు, మండల, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ సాధారణ సమావేశం

ధర్మపురి, జనవరి 31: ధర్మపురి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాల గురించి సభ్యులతో చర్చించి ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించారు. జనవరి 2024 సంవత్సర ఆదాయవ్యయాల గురించి చర్చించి 14 అంశాలను ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, జనవరి 31: స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం మండలంలోని మెట్లచిట్టాపూర్‌లో శిక్షణ పొందిన 18 మంది మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన సబ్సిడీ కుట్టు మిషన్లను ఎంపీపీ మారు సాయిరెడ్డితో కలిసి అందజేశారు. అనంతరం జూట్ బ్యాగులు తయారు చేస్తూ ఆర్థికాభివృద్ధి పొందుతున్న మహిళలను అభి నందించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను మహిళలు, ప్రజాప్రతినిధులు, నాయకులు శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రమను నమ్ముకుని మహిళలు తమ పనులపై శ్రద్ధ చూపితే మగవారి కంటే ఎక్కువ సంపాదిస్తారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక గల్ఫ్ బాట పడుతున్న వారి కంటే మహిళలు స్వయం ఉపాధితో సంపాదించాలన్నారు. చదువుకొని ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా మహిళలు వారు చేసే పనుల్లో ఇంకొకరికి ఉద్యోగావకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. స్వశక్తితో జీవితంలో ముందుకు సాగుతు నేటితరం యువతకు ఆదర్శంగా నిలిచే విధంగా మహిళలు వ్యాపారం చేయాలన్నారు. మహిళలు తయారు చేసిన జ్యూటు బ్యాగులు పట్టణాలు, నగరాలకు సరఫరా చేసే స్థాయికి ఎదగాలన్నారు. గ్రామాల్లో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులు ప్రజల మనస్సుల్లో నిలిచిపోతాయని, సర్పంచుల పదవీ కాలం అయిపోతున్నందున సర్పంచ్ బద్దం శేఖర్‌రెడ్డితో పాటు పాలక వర్గం సభ్యులను శాలువతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచులు ఆకుల రాజారెడ్డి, పీసు తిరుపతిరెడ్డి, ఉపసర్పంచు రాజారపు భూమేశ్వర్, ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్ తీగల లింగారెడ్డి, నాయకులు సదిరం గంగాధర్, గడ్డం రాజారెడ్డి, ముద్దం నరసింహులు, రాజాగౌడ్, కార్యదర్శి, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.


కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్


బుద్ధుని విగ్రహం వద్ద విద్యార్థులతో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

● మహనీయుల చరిత్రను నేటి తరానికి తెలపాలి

మెట్‌పల్లి రూరల్: భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మహనీయుల చరిత్రను నేటి తరానికి తెలపాల్సి బాధ్యత మనందరిపైన ఉందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం మండలంలోని మేడిపల్లి మడేలేశ్వర స్వామి ఆలయం నిర్మాణానికి సర్పంచు పీసు తిరుపతిరెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం చౌలమద్దిలో ఏర్పాటు చేసిన అల్లూరి సీతారమరాజు విగ్రహాన్ని ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచు గడ్డం లింగారెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహనీ యుల త్యాగాలతోనే నేడు దేశంలో సురక్షితంగా ఉంటున్నమన్నారు. ప్రజలతో ఉండి గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే లక్ష్యమన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పీసు తిరుపతిరెడ్డి, గడ్డం లింగారెడ్డి, మెట్‌పల్లి ఎల్ఎస్‌సీఎస్ చైర్మన్ తీగల లింగారెడ్డి, నాయకులు గడ్డం రాజారెడ్డి, అలాల రాజేష్, నేరెళ్ల రాజాగౌడ్, గ్రామ పాలక వర్గం సభ్యులు, మహిళలు, గ్రామస్థులు, తదితరుల పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. మండలం లోని నాగులపేట గ్రామంలో ఆడెపు రాజేశ్వర్ జ్ఞాపకార్థం అతని భ్యార ఆడెపు సత్తెమ తన సొంత ఖర్చులతో గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయగా గ్రామస్థులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సత్తెమ్మను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌తో పాటు గ్రామస్థులు సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాస్కర్ రెడ్డి, ఎఖీన్‌పూర్ సింగిల్ విండో చైర్మన్, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ నర్సరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు సన్మానం

గొల్లపల్లి, జనవరి 31: గ్రామపంచాయతీ పాలకవర్గం కాలపరిమితి ముగియనుండగా ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పాలకవర్గానికి బుధవారం సన్మానం చేశారు. గొల్లపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గమైన ఉపసర్పంచ్ మారం రాజశేఖర్, వార్డు సభ్యులు బోయపోతు శేకర్, జనుప వెంకటేష్, నక్క లక్ష్మి, పడాల దేవవ్వ, కో ఆప్షన్ మెంబర్లు పల్లె నల్లగొండం, నాగుల చందులకు సామాజిక సేవకుడు చౌట్‌పెల్లి తిరుపతి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం అదృష్టమని, ఎల్లప్పుడూ ప్రజా సేవ చేస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కచ్చు కొమురయ్య, సామల వీరస్వామి, బోజనపు శ్రీనివాస్, ఎదులాపురం భాస్కరాచారి, ముదాం సురేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి: సర్పంచులు, ఉపసర్పంచులు తమ ఐదేండ్ల పదవీకాలంలో ప్రజలకు చేసిన సేవలు అమోఘమని పెగడపల్లి జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్ రావు, ఎంపీపీ గోలి శోభాసురేందర్‌రెడ్డి అన్నారు. పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని 23 గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాలువాలు, పూలమాలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. పలువురు వక్తలు మాట్లాడుతూ కరోనా విపత్కర సమయంలో సర్పంచులు వారి పాలకవర్గాలు అధికారులను, ఉద్యోగులను సమన్వయంతో చేసిన సేవలు ఎంత చెప్పినా తక్కువేనంటూ అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె పుల్లయ్య, తహసీల్దార్ ఎంఎ ఫారూక్, ఎంపీవో మహేందర్, సూపరిండెంట్ చక్రదర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రవీందర్, అంజయ్య, అనసూర్య, విజయలక్ష్మి, స్వామి, తిరుపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


పెగడపల్లిలో పంచాయతీ పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

జగిత్యాలరూరల్: మండలంలోని కన్నాపూర్ సర్పంచ్ కొక్కు సుధాకర్ తన పదవీకాలాన్ని ఐదు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా గ్రామస్థాయి అధికారులు, గ్రామప్రజలు సర్పంచ్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తన పదవీకాలంలో గ్రామ అభివృద్ధికి సహకరించిన ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, గ్రామస్థాయి అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

కేసీఆర్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

- టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్

ఇబ్రహీంపట్నం, జనవరి 31: కేసీఆర్ దిగజారుడు రాజకీయలు మానుకోవాలని ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పినా ఇంకా బుద్ధి రావడం లేదని టీజేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట శంకర్ విమర్శించారు. కొదండరాం ఎమ్మెల్సీ ఎన్నికను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ, మాజీ సీఎం కేసీఆర్‌లు కోర్టు స్టే తేవడం వారి చిల్లర రాజకీయలకు నిదర్శనం అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని టీజేఎస్ కార్యలయంలో అయన పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ కోటాలో ఉద్యమకారుడు, విద్యావంతుడు కోదండరామ్‌ను గుర్తించి ఎమ్మెల్సీగా నియమిస్తే బీఆర్ఎస్ నాయకులు సభ్యత్వం నిలుపుదలకు స్టే తేవడం కేసీఆర్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. తమ అవినీతి చట్టా సభల్లో బయటపెడుతాడని అడ్డుకుంటున్నారని అన్నారు. రాబోయే కాలంలో ఉద్యమకారులు బీఆర్ఎస్‌ను బొంద పెడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో టీజేఎస్ మండల అధ్యక్షుడు కంతి రమేష్, నాయకులు మల్లయ్య, తిరుపతి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో అవసరం


మాట్లాడుతున్న వికాస్‌రావు

మేడిపల్లి, జనవరి 31: మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే శారీరిక శ్రమ,, వ్యాయామం ఎంతో ఉపయోగపడుతందని బీజేపీ నేత డా. చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేడిపల్లిలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం పలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు క్యాతం దశరథరెడ్డి, ముంజశ్రీనివాస్ గౌడ్, మహేంధర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, ధర్మరెడ్డి, జగన్‌రెడ్డి, రాజు, మధు, ఇబ్రాయిల్, శంకర్ తదిరతులు పాల్గొన్నారు.

హైమాస్ట్‌లైట్లు తీసిన వారిపై ఫిర్యాదు

కొడిమ్యాల, జనవరి 31: మండలంలోని వివిధ గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు తీసుకుపోయిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం కొడిమ్యాల పోలీసులకు, ఎంపీడీవో పద్మజారాణి, తహసీల్దార్ రవికాంత్‌కు ఫిర్యాదు చేసినట్లు కొడిమ్యాల గ్రామ పంచాయతీ మాజీ సభ్యుడు రాచకొండ చంద్రమోహన్ తెలిపారు. గ్రామంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన వాటిని తొలిగించిన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పంట నష్టం చేసిన వారిపై కేసు

కొడిమ్యాల, జనవరి 31: మండలంలోని గంగరాంతండా గ్రామానికి చెందిన జైల్‌సింగ్, బూక్య లక్ష్మణ్, బూక్య రమేష్ వరి పంటను నష్టం చేశారని అదే గ్రామానికి చెందిన బూక్య మంగు బుధవారం పోలీసులకు పిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ అర్జరాజు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు వరి పొలంపై గడ్డి మందు కొట్టగా పంట నష్టం జరిగిందని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

క్రీడా దుస్తులు పంపిణీ

కొడిమ్యాల, జనవరి 31 : మండల కేంద్రానికి చెందిన గుర్రం ప్రవీణ్ అనే యువకుడు అమెరికాలో ఉంటై కొడిమ్యాల గ్రామానికి చెందిన రాయల్ క్రికెట్ టీం సభ్యులకు 15 వేల రూపాయల విలువైన క్రీడా దుస్తులను బుధవారం పంపారు. కొడిమ్యాల గ్రామం తరుపున వివిధ ప్రాంతాల్లో క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్నందుకు క్రీడా దుస్తులను పంపినట్లు క్రికెట్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు ఎర్రోజు మొహనాచారి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు రాపర్తి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కోశాధికారి రాకేష్, కార్యదర్శి డేవిడ్‌సన్, ఉప కార్యదర్శి నాగర్జున్, సభ్యులు మహేష్, సంతోష్ తదితరులు ఉన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

మెట్‌పల్లి, జనవరి, 31 : పట్టణంలోని అబేంద్కర్ మినీ స్టేడియంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పోటీల్లో మహాత్మా జ్యోతిబాపూలే విద్యార్థులు ప్రతిభ కనబరించారు. అథ్లెటిక్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అండర్ 8, 10, 12, 14 విభాగాల్లోని జ్యోతి బాపూలే విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థులను, పీఈటీ ప్రశాంత్‌ను ప్రిన్సిపాల్ పల్లవి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఆటల్లో రాణించడంతో వారి భవిష్యతుకు ఎంతోగానో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో పీఈటీ, ఉపాధ్యాయ బృందం, క్రీడాకారులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

మెట్‌పల్లి, జనవరి, 31: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని 26 వార్డుల నూతన ఇన్‌చార్జులకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడల్లో ప్రతి ఇంటికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను గురించి వివరించాల న్నారు. కార్యక్రమంలో పట్టణ మహిళ అధ్యక్షురాలు అందే భవితరాణి, పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, అందే మారుతి, జెట్టి లక్ష్మణ్, జాజాల రాజగోపాల్, బుర్ర మహేందర్‌గౌడ్, పొన్నం ఎల్లేష్, సురేష్, స్రోగాంబి, మహిళలు నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ వార్డు ఇన్‌చార్జిలకు నియామక పత్రాలను అందజేస్తున్న కృష్ణారావు

● మున్సిపల్ డబ్బులు రికవరీ చేయాలి..

కోరుట్ల: కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు మున్సిపల్ ఖజానాకు గండి కొట్టాడని ఆయన నుంచి డబ్బులు రికవరీ చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని జువ్వాడి భవనంలో స్థానిక నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పది సంవత్సరాలుగా తన సొంత అవసరాల కోసం మున్సిపల్ సిబ్బందితో వ్యక్తిగత పనులను చేయించుకొని మున్సిపల్ ఖజానా నుంచి జీతాలు ఇప్పించడం విచారకరమని అన్నారు. తన ఇంట్లో ఆరుగురు మున్సిపల్ సిబ్బందిని వ్యక్తిగత పనుల్లో ఉంచుకొని మున్సిపల్ నుంచి జీతాలు ఇప్పింపించి మున్సిపల్ ఖజాన్‌కు గండి కొట్టాడని ఆరోపించారు. సుమారు ఒక కోటి ఎనిమిది లక్షల రూపాలు మున్సిపల్‌కు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరుగురి కార్మికుల జీతాలు నెలకు రూ. 15,000 ఉండంగా పది సంవత్సరాల్లో ఒక కోటి ఎనిమిది లక్షల రూపాయలు అవుతాయని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొంతం రాజం, నయిం, ఏలేటి మహిపాల్ రెడ్డి, దిలీప్, ఇంద్రాల హరీష్, సైదు గంగాధర్, తెలు రాజు కుమార్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

అంబేద్కర్, వివేకానంద విగ్రహాల ఆవిష్కరణ


విగ్రహాలను ఆవిష్కరిస్తున్న జడ్పీటీసీ, ఎంపీపీ

కథలాపూర్, జనవరి 31: మండలంలోని తుర్తిలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్, స్వామి వివేకానంద విగ్రహాలను జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీపీ జవ్వాజి రేవతి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం ఎంతో స్పూర్తిదాయకమని పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని సర్పంచుల ఫోరం, స్వామి వివేకానంద విగ్రహాన్ని గడ్డం భూమారెడ్డి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ గంద్ర కిరణ్‌కుమార్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఎంజీ రెడ్డి, ఉప సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచ్ మట్కుం గంగనర్సయ్య, వార్డు సభ్యులు, యూత్ సభ్యులు ఉన్నారు.

అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం


అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న అధికారులు, తోటి ఉద్యోగులు

మెట్‌పల్లి, జనవరి 31: విద్యుత్ ట్రాన్స్‌కోలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు గణతంత్ర దినోత్సవ కార్యక్రమంలో భాగంగా టీఎస్ఎన్‌డీసీఎల్ సీఎండీ కరుణాటి వరుణ్‌రెడ్డి, కలెక్టర్ యాస్మిన్‌భాషాల చేతుల మీదుగా ఉత్తమ అవార్డులు అందుకున్న వారిని తోటి ఉద్యోగులు శాలువలతో ఘనంగా సన్మానించారు. బుధవారం పట్టణంలోని సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణంలో అవార్డు గ్రహితలు జేఈవో కైరంకొండ ప్రసాద్, జేఎల్ఎమ్ పుప్పాల రాము, డివిజన్ అధ్యక్షుడు మునుగిరి లక్ష్మణ్, కార్యదర్శి లక్కంపల్లి సురేష్, కోటగిరి మహేష్, సాంబమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవిలను 1104 యూనియన్ నాయకులు శాలువలతో ఘనంగా సన్మానించిన అభినందించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ కార్యదర్శి అవధూత సురేష్, అంజనీ ప్రసాద్, సర్కిల్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్, నాగరాజ్, జేఏవోలతో పాటు సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, కార్మికులు, 1104 యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బోరు బావి ఏర్పాటుకు నిధులు మంజూరు

కథలాపూర్, జనవరి 31: మండలంలోని పోసానిపేటలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వద్ద బోరు, మోటర్ ఏర్పాటుకుగాను జిల్లా పరిషత్ నిధులు రు. 1.25 లక్షలు మంజూరు కాగా జడ్పీటీసీ నాగం భూమయ్య బుధవారం ప్రొసీడింగ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంజీ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గుండారపు సౌజన్యగంగాధర్, ఎంపీటీసీ మల్యాల రమేశ్, కోఆప్షన్ సభ్యుడు రఫీ, చెక్కపల్లి రాజు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కొడిమ్యాల, జనవరి 31: కొడిమ్యాల సింగిల్ విండో ఉపాధ్యక్షురాలు గడ్డం కవితచంద్రమొహన్‌రెడ్డి అత్తమ్మ లక్ష్మీనర్సమ్మ ఇటీవల మృతి చెందగా బుధవారం ఎంపీపీ స్వర్ణలత పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ వెంట ఉపాధ్యక్షుడు ప్రసాద్, గ్రామస్థులు ఉన్నారు.

పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుంది

మెట్‌పల్లి, జనవరి 31: విద్యార్థులు పోటీ పరీక్షలు రాయడంతో వారిలో నైపుణ్యం పెరుగుతుందని మెట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రావుపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మెట్‌పల్లి డివిజన్ లోని పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు 2వ డివజన్ స్థాయి ప్రతిభ పరీక్షను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. నిర్వహించిన పరీక్షలో డివిజన్‌లోని 600 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులకు పోటీతత్వంపై అవగాహన కల్పించడానికి పదో తరగతి చదువుతున్న వారికి పరీక్షను నిర్వహించడంతో వారిలో ఉన్న ప్రతిభ తెలుస్తుందన్నారు. పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరించిన విద్యార్థులకు కళాశాల వార్షికోత్సవం రోజున బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్ పథకాలపై అవగాహన

ఎల్లారెడ్డిపేట, జనవరి 31: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంక్ డిపాజిట్ పథకాలపై బుధవారం అవగాహన కల్పించారు. కల్పతరువు, కామధేనువు వంటి డిపాజిట్ పథకాల గురించి వివరించారు. బ్యాంక్‌లో డిపాజిట్ చేసి అధిక వడ్డీ పొందాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ సురేష్ పాల్గొన్నారు.